క్లుప్తంగా

చంద్రబాబుకు అధికార దాహం



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు అధికార దాహం ఎక్కువని, తానే ఎప్పుడూ సీఎంగా ఉండాలనుకుంటారని దాని కోసం ఆయన ఎన్ని విధ్వంసాలు సృష్టించేందుకైనా వెనకాడరని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెగ అప్పులు చేస్తోందని, రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందని బాకా లూదుతున్న టీడీపీ అధినేత సహా ఆ పార్టీ నేతలంతా ఆ పార్టీ హయాంలో చేసిన రూ. 2.6 లక్షల కోట్ల అప్పులు గురించి, అవి ఏం చేశారో దాని గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని అప్పులు చేసినా రాష్ట్ర అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమ పథకాలకేనన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు అప్పులు చేస్తే అవి ప్రజాప్రయోజనానికే అన్నట్లు, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులు చేస్తే అవి ఎందుకు అని మాట్లాడడం సరికాదన్నారు. ఇకనైనా అబద్ధాలు చెప్పడం మాని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని హితవుపలికారు. రైతు సంక్షేమ సంఘ సభ్యులు తిరుపతిరావు, సత్యంనాయుడు, నాగేశ్వరరావు, సన్యాసిరావు, రామారావు, సీతంనాయుడు ఉన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్ పరామర్శ



అప్పలమ్మ పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామ సర్పంచ్ రెడ్డి స్వామినాయుడు మాతృమూర్తి రెడ్డి అప్పలమ్మ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు గ్రామానికి వెళ్లి స్వామినాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. అప్పలమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట కాకరాపల్లి సర్పంచ్ వి.రమణ, కృష్ణంవలస సర్పంచ్ జి. సురేష్, యెన్ని శ్రీను, బూరాడ సీతారాం తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

రేగిడి: మండలంలోని గుళ్లపాడు పంచాయతీ ఉంగరాడమెట్ట వద్ద కొండలమామిడివలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 5లో అక్రమంగా నిర్మించిన షాపులను తొలగించాలని సర్పంచ్ వియ్యపు లావణ్య, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం తహసీల్దార్ టి. కళ్యాణచక్రవర్తికి వినతిపత్రం అందించారు. వండానపేట గ్రామానికి చెందిన ముంజేటి జగన్మోహనరావునాయుడు, ముంజేటి పురుషోత్తంనాయుడు, ముంజేటి జనార్దననాయుడు ఉంగరాడమెట్ట వద్ద మూడు షాపులను అక్రమంగా నిర్మించడంతో పాటు ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆక్రమణలు తొలగించి, ఆ స్థలంలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

సీపీఎం నేతల వినతి

రేగిడి: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు వి.తిరుపతిరావు, విశ్వనాథం, ఎం.త్రినాథరావు, పాపారావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రామభద్రపురం: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, తదితరులకు ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రమామణి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆమె లబ్ధిదారుల వద్దకే వలంటీర్లు వెళ్లి, పింఛన్ నగదు అందజేసేలా చూడాలని తెలిపారు. వలంటీర్ల పనితీరు బాగులేకపోతే తమకు తెలియజేయాలని, వారిని తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

బాడంగి: మండలంలో 98 శాతం మేర సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీకి సమయం ఉండగా, సోమవారం నాటికి 8,575 మందిలో 8,378 మందికి పింఛన్లు అందించినట్లు పేర్కొన్నారు. మిగతా వారికి మంగళవారం అందజేస్తామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వంగర: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ ప్రభుత్వాన్ని కోరారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జీఓ నెం. 117 రద్దు చేసి పాఠశాలల విలీన ప్రక్రియ నిలుపుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆనవరం గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. సీఎం జగనన్న వెంటే రాష్ట్ర జనమంతా ఉన్నారని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయమని జోష్యం చెప్పారు. ముందస్తు ఎన్నికలు వస్తాయని ప్రతిపక్షాలు చెబుతున్న మాటలు అవాస్తవాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలు, చేయనంత అభివృద్ధి పనులు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుతమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, మాజీ సర్పంచ్ ఈదుబిల్లి శ్రీనివాసరావు, మండల వైస్ ఎంపీపీ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వంలోనే రాజాం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రాజాం నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. రూ.20 కోట్లతో రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులతో పాటు, పట్టణంలో వైఎస్సార్ పార్క్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రూ.1.03 కోట్లతో యర్రవాని చెరువును పార్కుగా మార్చుతున్నట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున రాజాంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని పేర్కొన్నారు. పట్టణంలో కొత్తగా రెండు అర్బన్ పీహెచ్‌సీలు మంజూరు చేయడంతో పాటు పక్కా భవనాల నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సహకారంతో నియోజకవర్గంలో తాగు, సాగునీటి ఇబ్బందులను పూర్తిగా అధిగమించామని వివరించారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో ప్రతీ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్, వంగర మండలాల కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, తోట తిరుమలరావు, నల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ కిట్లు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ కిట్లు సోమవారం అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన జాతీయ మేధో వరవైకల్య సాధికారిత సంస్థ, సమగ్ర శిక్షా ప్రోత్సాహంతో సమకూర్చిన దాదాపు రూ.70 వేల విలువైన ఈ కిట్లు బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న విద్యార్థుల విద్యావికాసానికి ఎంతగానో దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ తెలిపారు. స్పెషల్ టీచర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ కిట్లను ఎంఈవోలు చల్ల లక్ష్మణరావు, గొట్టాపు వాసు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సహితవిద్య ఉపాధ్యాయులు పి.కృష్ణమోహనరావు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా ధర్నా

బాడంగి: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎ.సురేష్ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ వంటి ఇంధన ధరలతో పాటు, నిత్యవసర ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించాలని, నిరుపేద గిరిజనులకు ప్రభుత్వ భూములు పంచిపెట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ అజూ రఫీజాన్‌కు వినతిపత్రం అందజేశారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు జోష్యం చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు జై.. కొడుతున్నారని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు జనం ఉవ్విళ్లూరుతున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వచ్చి, అబద్ధపు హామీలతో మరోసారి ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారన్నారు. టీడీపీకి అధికారమిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసిందకనుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామగ్రామాన ఇంటింటికీ తిరగగలుగుతోందన్నారు. సీఎం జగనన్న పాలన బాగుంది కాబట్టే తమకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సీఎం జగన్ ఎన్నిసార్లు సీఎం అయితే అన్నాళ్లు రాష్ట్రంలోని ప్రతీ ఇల్లు బాగుంటుందన్నారు. అప్పటి పాలనకు, ఇప్పటి పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలే గమనించి, తీర్పు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి జెడ్పీటీసీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్న రిటైర్డ్ టీచర్ కొండలరావు

తెర్లాం: మండల స్థాయిలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న జగనన్నకి చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించి, పరిశీలించారు. అనంతరం వాటిని శాఖల వారీగా అందజేసి, ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఒకవేళ ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే అది ఎందుకు పరిష్కారం కాలేదోనన్న విషయం కూడా అర్జీదారునికి తెలియజేయాలన్నారు. ఇదిలా ఉండగా, విద్యుత్ సమస్యపై తెర్లా ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సంతపురి కొండలరావు గత సోమవారం జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఏఈ జోగినాయుడుకి ఎంపీడీవో ఆదేశాలు జారీ చేయగా, ఆ సమస్య పరిష్కారం కావడంతో సదరు వ్యక్తి ప్రస్తుత సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చి, ఎంపీడీవో, విద్యుత్ ఏఈకి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఖాతాలో పాగిరి ఉప సర్పంచ్



బగ్గు రాధకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: మండలంలో పాగిరి పంచాయతీ ఉప సర్పంచ్ పదవి వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరిపోయింది. గతంలో ఇక్కడ ఉప సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు శాసుబిల్లి రాము ఉండేవారు. ఆయన మృతి చెందడంతో ఇటీవల వార్డు మెంబర్ ఎన్నిక జరిగింది. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు పంచాయతీలోని 13 మంది వార్డు మెంబర్లు, సర్పంచ్ కృష్ణవేణి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారునివైపు ఆరుగురు వార్డు మెంబర్లతో పాటు సర్పంచ్ మద్దతివ్వగా.. టీడీపీ మద్దతుదారునివైపు ఏడుగురు వార్డు మెంబర్లు మద్దతిచ్చారు. దీంతో ఎన్నికల అధికారి డ్రా ద్వారా ఉప సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. ఈ డ్రాలో వైఎస్సార్ సీపీ మద్దతుదారైన 13వ వార్డు మెంబర్ బగ్గు రాధ ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆమెకు ఎన్నికల అధికారి వావిలపల్లి శ్రీనివాసరావు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందించారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన బగ్గు రాధను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ పాగిరి కృష్ణవేణి అభినందించారు.

చంద్రబాబు రూ.118 కోట్ల కుంభకోణంపై నోరు మెదపరేం..?

- టీడీపీ నేతలకు ఎమ్మెల్యే శంబంగి ప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అక్కసుతో లేనిపోని ఆరోపణలు చేస్తున్న టీడీపీ నేతలు వారి పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేసిన రూ.118 కోట్ల కుంభకోణంపై ఎందుకు నోరు మెదపరని(మాట్లాడరని) ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన గతంలో టీడీపీ హయాంలో రూ.8 వేల కోట్ల విలువైన నిరుపేదల ఇళ్ల నిర్మాణాలను డొల్ల కంపెనీలకు కట్టబెట్టి, వివిధ మార్గాల్లో రూ.118 కోట్లను చంద్రబాబు అక్రమంగా పొందిన విషయం రుజువైనా దానిపై ఆ పార్టీ నేతలు గానీ, ఎల్లోమీడియా గానీ స్పందించకపోవడం దారుణమన్నారు. సింగపూర్‌లా అభివృద్ధి చేస్తానని చెప్పి, తాత్కాలిక భవనాలకు వేసిన స్కెచ్‌నే పేదల ఇళ్ల నిర్మాణాల్లోనూ చేతివాటం ప్రదర్శించిన చంద్రబాబు ధోరణిని తాము మొదటినుంచీ తప్పుబడుతూనే ఉన్నామన్నారు. చివరకు ఐటీ నోటీసుల ద్వారా ఇవి వెలుగులోకి వచ్చాయన్నారు. ఇళ్ల నిర్మాణాల్లోని వివిధ రకాల కాంట్రాక్టులను షాపూర్జీ పల్లోంజీ అనే ఒకే వ్యక్తికి అప్పగించి, లబ్ధి చేకూర్చుకోవాలనుకున్న చంద్రబాబు దురుద్దేశాన్ని మరింత లోతుగా అధ్యయనం చేసి, ప్రజలకు తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తాను ఏం చేసినా ప్రజలు నమ్ముతారనే భావనలో చంద్రబాబు ఉన్నారని, ఆయన దొంగ నాటకాలు ప్రజలకు బాగా తెలుసన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, బొబ్బిలి పీఏసీఎస్ చైర్మన్ బొమ్మి అప్పలనాయుడు, బాడంగి మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి

వంగర: విద్యార్థులకు మరింత మెరుగ్గా విద్యాబోధన చేయాలని ఎంఈఓ వై.దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. మడ్డువలస ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, జగనన్న గోరుముద్ద అమలు, తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకుని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు.

సంక్షిప్తంగా...

బకాయి వేతనాలు చెల్లించండి

రామభద్రపురం: బకాయి వేతనాలు చెల్లించాలని గ్రీన్‌అంబాసిడర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు సీఐటీయూ నాయకుడు బలస శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పనులు నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారిని లోపలకు వెళ్లనీయకుండా, లోపల ఉన్న వారిని బయటకు రానీయకుండా నిరసనకారులు అడ్డుకున్నా రు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే తమ కుటుంబ పోష ణ ఎలా అని ప్రశ్నించారు. బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు నెలనెలా వేతనాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు జెడ్పీ చైర్మన్ పుట్టినరోజు

రాజాం: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలని వినతి

రాజాం సిటీ: గార్రాజుచీపురుపల్లి గ్రామంలో శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు సోమవారం తహసీల్దార్ ఎస్‌కే రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా గ్రామంలో సమస్య ఉందని, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. శ్మశానవాటిక చెరువకు ఆనుకుని ఉండడంతో వర్షాలు పడే సమయంలో శవాన్ని కూడా తీసుకువెళ్లలేని పరిస్థితి నెలకొంటోందన్నారు. అలాగే చెరువు ఆక్రమణలకు గురికావడంతో మృతదేహాలను పూడ్చేందుకు స్థలం లేదని తెలిపారు. తక్షణమే స్థలాన్ని కేటాయించి గ్రామస్తులు కోరారు.

పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై ఆరా

బాడంగి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై తహసీల్దారు అజూ రఫీజాన్ ఆరాతీశారు. ఇదే విషయమై ఆయన వీఆర్‌వోలతో సోమవారం సమావేశమై, పోలింగ్‌కు కేంద్రాలు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే విషయం అడిగి తెలుసుకున్నారు. కోడూరు గ్రామంలోని ఆర్‌సీఎం స్కూల్ నిర్వహణలో లేకపోవడం, పాల్తేరు జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రామానికి దూరంగా ఉండడం, లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో వర్షపునీరు కారిపోతున్న కారణాల రీత్యా ఆయా పాఠశాలలు పోలింగ్‌కు అనుకూలం కాదని వీఆర్‌వోలు వెల్లడించారు. సమావేశంలో మండల సర్వేయర్ సాయికుమార్, ఎన్నికల డీఈవో విజయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని పరిశీలించాలి

తెర్లాం: మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి, తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పరిశీలన చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఒక్కో శాఖకు సంబంధించిన ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు చేసే ఈ పరిశీలన ద్వారా గ్రామ స్థాయి అధికారులు కూడా సక్రమంగా పనిచేస్తారన్నారు. అలాంటప్పుడే గ్రామాల్లోని సమస్యలు తెలుస్తాయన్నారు. ప్రతీ గ్రామంలోని సమస్యను గుర్తించి, పరిష్కరించాలని కోరారు.

7,8వ తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు

తెర్లాం: మండలంలోని పెరుమాళి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 7, 8వ తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు త్రినాథరావు, పాపారావు తెలిపారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పీడీలు, పీఈటీలతో సమావేశమైన ఆయన ఆడుకుందాం..రా.. కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు విభాగాల్లో 9 క్రీడాంశాల్లో జరగనున్నాయన్నారు. 7న అండర్-14 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామని, 8న అండర్-17 విభాగంలో బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు.

పేటీఎం ద్వారా స్త్రీనిధి రుణాల చెల్లింపు

రేగిడి: స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను పేటీఎం ద్వారా తిరిగి చెల్లించేందుకు డీఆర్‌డీఏ కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని వైఎస్సార్ క్రాంతిపథకం ఏపీ ఎ.చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో వీఓఏలకు పేటీఎం మిషన్లను సోమవారం పంపిణీ చేశారు. డిజిటల్ లావాదేవీల చెల్లింపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా రేగిడి, జామి, నెల్లిమర్ల మండలాల్లో పేటీఎం చెల్లింపులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ నెల నుంచి స్త్రీనిధి రుణాలను పేటీఎం మిషన్ల ద్వారా చెల్లించవచ్చన్నారు. దీని వల్ల లబ్ధిదారులకు సమయం ఆదా అవుతుందని, సకాలంలో చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు స్త్రీనిధి ద్వారా ఒక్కొక్కరికీ రూ.1 లక్ష వరకు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజరు వి.సుధాకర్, ఏపీఎం టి.మంగమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

వలంటీర్ సేవాభావం

వంగర: మండలంలోని అరసాడ గ్రామ వలంటీర్ మజ్జి శ్రావణికుమారి తన సేవాభావాన్ని చాటుకుంది. గ్రామానికి చెందిన వృద్ధుడు పున్నాన కృష్ణమూర్తి అనారోగ్యం కారణంగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో తన బంధువులు ఇంట్లో ఉంటూ చికిత్స తీసుకుంటున్నాడు. పింఛన్ తీసుకునేందుకు అతను రాలేని స్థితిలో ఉన్నాడని తెలుసుకుని వలంటీర్ శ్రావణి పాలకొండ వెళ్లి ఆ వృద్ధుడికి పింఛన్ డబ్బులు అందజేసింది. వలంటీర్ శ్రావణిని వృద్ధుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

నియామక పత్రాలు అందజేత

సంతకవిటి: మండలంలోని బొద్దూరు, పుల్లిట, మంతిన గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఎంపికైన వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలు అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు చేతులమీదుగా ఎంపికైన ముగ్గురు అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు ఎంపీడీఓ జీవీ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, పి.సత్యంనాయుడు, ఎన్.విశ్వేశ్వరరావు, వి.రమణ, కె.వెంకటప్పలనాయుడు, వై.శ్రీను పాల్గొన్నారు.